

# ఆకాశంలో సగం

ం డా. వి.చంద్రశేఖరరావు

చాలాయేళ్ళుగా ఊడవని గదిలా మురికిగా వున్న నా ప్రపంచంలోకి హఠాత్తుగా జారిపడిన పూలకుండీ లలిత. లలితను చూసిన క్షణం నుంచీ నాలో చిత్రమైన అలజడి మొదలైంది. ఒంటరి స్త్రీని చూడగానే 'దొరికిందిరా పిట్ట' అనుకునే సగటు మగబుద్ధి ఒకవైపు, ఆమె ధీరోదాత్తతకు, ఆమె జీవన పోరాటానికి స్పందించి ఆమెను అభిమానించే బుద్ధిజీవి ఇంకోవైపు, ఈ సంఘర్షణ కాన్సర్ క్రిమిలా నా మనస్సును తొలుస్తూనే వుంది. నేనో సగటు వ్యక్తిని అని తెలిసీ కూడా ఒక ఎగ్జైటింగ్ రంగస్థలాన్ని సృజించుకొని – గంభీరమైన పాత్రను పోషిస్తున్న తీరు వింతయిన భయాన్ని నాలో కల్గిస్తుంది.

లలిత నా చిన్నప్పటి స్నేహితురాలు. ఇంటరుదాకా కలిసి చదివాము. నెల రోజుల క్రితం పుస్తకాల షాపులో కలిశాను లలితను. సరిగ్గా పదేళ్ళ తరువాత. ముందు లలితే గుర్తు పట్టింది. "ఏమ్రా నువ్వేనా? రాజశేఖరం, ఎ.సి.కాలేజి 1978 ఇంటర్మీడియట్ ఫేమ్!" పెద్దగా అరిచింది. అవునన్నట్టుగా చిరునవ్వు నవ్వాను. కొద్దిగా రంగుమాసినా, అందమైన పెయింటింగ్‌లా ఇప్పటికీ అవే రంగులు, అవే మిలమిలలు. హఠాత్తుగా ఆమెను చూసిన షాక్ నుండి తేరుకొని "పదేళ్ళుగా తపస్సు చేస్తున్నాను. ఇప్పటికి దయకలిగి ప్రత్యక్షమయినావా? దేవీ లలితాంబిక!" అన్నాను నాటకీయంగా. నా వైపు గుర్రుగా చూస్తూ "రాస్కెల్! పలకరించిన రెండు నిముషాలకు గానీ గుర్తుపట్టలేని ఏమ్నీషియా ముఖం నువ్వు, నా కోసం తపస్సు చేస్తున్నావా – ఉత్త గ్యాస్!' ' అంటూ దబాయించింది.

"నీ కబుర్లతో నన్ను మంత్రించి, నీ స్నేహంతో నన్ను శుద్ధి చేసిన మాంత్రికురాలివి. నిన్నెలా మర్చిపోతాను. పదేళ్ళ తరువాత దొరికావు. తనివితీరా నీ కబుర్లు వినాలి. పద. హోటల్‌కి వెళ్ళి తాపీగా మాట్లాడుకుందాం" అంటూ హోటల్ వైపు నడిచాను.

"నో ఇప్పుడు కాదు రాజా! టయిమ్ లేదు. ఇదిగో ఇన్విటేషన్. నా డాన్స్ ప్రోగ్రాం వుంది కళా

మండపంలో. ప్రోగ్రాం అయినాక ఏంటీ రూమ్‌లో కలుద్దాం. నా రూమ్‌కి వెళదాము. రాత్రికి డిన్నర్ నాతోనే మరిచిపోవద్దు."

ఆ రాత్రి గ్రాండ్‌గా పార్టీ యిచ్చింది లలిత. చికెన్ బిరియానీ, మటన్ కబాబ్, ఫిష్ కట్‌లెట్, సీలువిప్పని స్కాచ్ బాటిల్.

"ఏమిటీ మిలటరీ తిండ్లు అని ఆశ్చర్యపోకు. నీ కోసమే ఎరేంజ్ చేయించాను. యు ఆర్ ఎ స్పెషల్ గెస్ట్ మి" లలిత ఉద్వేగంగా వుంది. జ్ఞాపకాల మూటను విప్పి మధురమైన జ్ఞాపకాలన్నీ వెలికి తీస్తుంది. ఆ సంఘటనలన్నీ నాకు తెలిసినవే అయినా తన నోటి నుండి వింటుంటే ఆ సంఘటనలకు రంగూ రుచీ వాసన వచ్చి మనోహరమైన స్వప్న విశేషాల్లా అనిపిస్తున్నాయి. మాటల మధ్యలో ఆమె భర్త గురించి, పిల్లల గురించి అడిగాను. ఆ మాటలో నిశ్శబ్దం, సన్నని విషాదం అలుముకున్నాయి ఆమె ముఖంలో. "యూ నో ఐయామ్ డైవోర్సుడ్. భర్తను, అయిదేళ్ళ పాపను వదిలి వచ్చాను. ఆ యిల్లు ఒక రాక్షస పంజరంలా అయిపోయింది. స్వేచ్ఛ కావాలనిపించింది. పంజరాన్ని విరిచి, రెక్కలు విప్పాను." స్టీరియోలోంచి సన్నగా ముఖేష్ పాట వినిపిస్తుంది. "యే ధర్ద్ భరీ దిల్..." కన్నీటి జాలు కమ్మనిపాటలా ఘనీభవించినట్లుగా వుంది. గది అంతా అగరువత్తి పొగలా విషాదం వ్యాపించి వుంది.

"కండోలెన్స్ మీటింగ్‌లో వక్తలా అలా ముఖం పెట్టకు. ఐ హావ్ నో రిగ్రెట్స్! భర్త, పిల్లలు వాళ్ళ అభివృద్ధితోనే స్త్రీ సుఖదుఃఖాలను కొలిచే పాతకాలపు విలువలను నేను కేర్ చెయ్యను. ఇంటరన్నా పూర్తి కాలేదు. ఈ వెధవ బయటికి వెళ్ళి ఎలా బ్రతుకుతుంది. నాలుగు రోజుల్లో తిరుగుటపాలా వెనక్కు రాకపోతుందా? అనే ధీమాతో వున్నాడా మనిషి. మళ్ళీ అతని ముఖం చూడలేదు. జీవించాలన్న తెగువే జీవితానికి సమాధానం అని నిరూపించాను. ఎప్పుడో చిన్నప్పుడు సరదాగా నేర్చుకొన్న డాన్స్‌కు పదును పెట్టి, ప్రాణం ఒడ్డి నలుగురు చేత 'ఒహో' అనిపించుకొనే ఆర్టిస్టునయ్యాను. నౌ ది వరల్డ్ ఈజ్ ఎట్ మై ఫీట్!"

**ఆరాధనగా ఆమె వైపు చూశాను. వివాహ వ్యవస్థపై అట్టే నమ్మకము లేని వ్యక్తిని నేను. ఇద్దరి మధ్య గౌరవము, మర్యాద. సమాన స్థాయిని కల్పించలేని పెళ్ళిని కన్‌సిడర్ చెయ్యనవసరం లేదని నా వాదం. ఆ రోజు నుంచీ లలితను కలవడం, ఆమెతో కొన్ని గంటలు గడపడం నా దినచర్యలో భాగమైంది. క్రమంగా లలితను కలుసుకోవడం ఒక వ్యసనమైంది. స్త్రీ సాన్నిహిత్యంలో కలిగే వింత సెన్సేషన్సు కోసం, హాయి కోసం ఆమె చుట్టూ ఉపగ్రహంలా తిరుగుతూనే వున్నాను. అయితే నా స్నేహంలో నిజాయితీ పాలు ఎంత? నాకు నేను స్పష్టమైన సమాధానం చెప్పుకోవాల్సి వుంది.**

ముప్పయ్యేళ్ళ బ్రహ్మచర్యం. ఈ సెలిబసీ శరీరం మీద మనసు మీద గొప్ప ఏసాల్టు. పగలంతా సంస్కారపు బుట్టలో దాచిపెట్టిన కోర్కెల పాములు రాత్రికి బుసలు కొడుతూ పైకి లేస్తాయి. జ్వలించే కోర్కె, వింతయిన సెక్స్ ఆకలి. రెండు చుక్కల విస్కీనో, కాంపోజ్ మాత్రనో వేసి ఆ రాత్రికి సర్పక్రీడను ఆపి నిద్రలోకి నిష్క్రమిస్తాను. ఇలాంటి వాతావరణంలోకి 'లలిత' ప్రవేశించింది. లలిత నా బలహీనతలకు, ఆదర్శాలకు మధ్య పోటీని పెట్టి వినోదం చూస్తూంది.

***

రాత్రి పదకొండు గంటల మధ్య కాలింగ్‌బెల్ మోగింది. తలుపు తీస్తే లలిత. ఎర్రబారిన కళ్ళు, చెదిరిన జుట్టు. వత్తి పెద్దదై భగభగ మండుతున్న లాంతరు దీపంలా వుంది.

"లోపలికి రావచ్చునా డాక్టర్!"

"రా లలితా! నీకు ప్రత్యేక ఆహ్వానం కావాలా? ఎనీ హెల్త్ ప్రాబ్లమ్?"

"లోపలికి పద చెప్తాను" అంటూ హాలులోకి దారితీసింది. "నిద్ర పట్టడం లేదు. ఏదో స్పష్టంగా తెలియని బాధ. ఎవరైనా సన్నిహితులు దొరికితే వాళ్ళను కలుసుకొని నా గోడు చెప్పుకొని ఓదార్పు పొందాలనిపించి ఇటు వచ్చాను. నీ నిద్రను పాడు చెయ్యలేదు కదా!"

"అదేమీ లేదు. అనుకోని అతిథికి ఏం ఆతిథ్యం ఇద్దామా అని ఆలోచిస్తున్నాను."

"అట్టే బుర్ర పాడుచేసుకోకు. ఆతిథ్యాన్ని కూడా వెంట తెచ్చుకున్నాను" అంటూ హాండ్ బ్యాగ్ లోంచి క్వార్టర్ బాటిల్ బయటకు తీసింది. విస్కీ సీసాను చూడగానే పామును చూసినట్టుగా ఉలిక్కిపడ్డాను. మొహమాటం కోసం, గ్లాసులు, సోడా, సాయంకాలం మిగిలిన పకోడీలు టేబుల్‌పై సర్దాను. కుర్చీ దగ్గరకు లాక్కుని కార్కు విప్పదీసింది.

మనస్సు రహస్యపు పొరల్లో మళ్ళీ పాముల కదలిక మొదలైంది. ఒక్క గుక్క విస్కీ లోపలికి వెళ్ళేసరికి వింత సెన్సేషన్స్ మొదలై ముఖమంతా టెన్స్‌గా ఉబ్బుగా తయారైంది. "ఏమిటోయి అంత నెర్వస్‌గా అయిపోయావు? రాత్రిపూట ఆడపిల్లతో మందు కూడా కొట్టలేనంత పిరికి వాడివా? "

"లేదు లలితా! ఇవి జ్ఞాపకాల బరువు తాలుకు నిట్టూర్పులు — కంగారు లేదు. అయామ్ బాలెన్స్‌డ్."

లలిత ఒక మిస్చీవస్ నవ్వు నవ్వి మళ్ళీ గ్లాసులోకి విస్కీ వొంపింది. వద్దు వద్దంటూనే రెండో రౌండ్ కూడా పుచ్చుకున్నాను. రెండో రౌండ్‌తో సెన్సెస్ బ్లాక్ వచ్చింది. లలిత చెప్పే మాటలేమీ చెవికి ఎక్కడం లేదు. హాయైన భావన నరాల తీగలపై నుండి జరజరా పాకుతున్న ఫీలింగ్. ఎదురుగా లలిత తపోదీక్షతో వున్న అప్సరసలా వుంది. లలిత తన జ్ఞాపకాల చిట్టాను బయటకు తీసింది. భర్త కిరాతకాల్ని గురించి చెబుతూంది. **"ఆడదాన్ని సున్నితంగా ముట్టుకోవడం తెలియని వాజమ్మ. హి యీజ్ ఎ బ్రూట్. వాడు మొగుడు కాదు రేపిస్టు. ఆరేళ్ళ వైవాహిక జీవితంలో ప్రతి రాత్రి వాడు నన్ను రేప్ చేసేవాడు. ఈ మగ వెధవలందరికీ 'లవ్—మేకింగ్' లో పాఠాలు చెప్పాలనిపిస్తుంది. శరీరంపై దాడి చెయ్యడం తప్ప మనసుని స్పృశించడము తెలియని అనాగరికులు ఈ మగవాళ్ళు. సారీ డాక్టర్! నువ్వా**

### ఎవరి పని

"నేను తట్టుకోలేను... ఇక చచ్చిపోతాను డాక్టర్."

"తప్పమ్మా... అందుకు నేను న్నాను గదా!"

—శిరీష

మగవాడివే కదూ!'' లలిత లైమెట్‌గా మారిపోయింది.

మూడో రౌండు ముగిసేసరికి లలిత కంఠంలోని కరుకుదనం ఎగిరిపోయి లాలిత్యం, మత్తు ధ్వనిస్తున్నాయి "రాజా దగ్గరికి రా! నా స్త్రీత్వపు మృదుత్వాన్ని ఛిద్రం చేసిన రాకాసి జ్ఞాపకాల నుంచి ఓదార్పు కావాలి. కమ్ నియర్ డాక్టర్! నన్ను నీ ఒడిలోకి తీసుకొని అమ్మలా లాలించు.'' పసిపాపలా చేతులు చాచింది లలిత. మహాసర్పపు క్రూరత్వంతో రాక్షసత్వంలో ఆమెను సమీపించాను.

ఉద్రేకపు రాపిడిలో, ఆమె వంటిపై వస్త్రం జారి, వక్షస్థలాన్ని బిగుతుగా కప్పిన వలువలు విడిపోయి, ఆ నగ్నత్వాన్ని కళ్ళనిండా నింపుకోబోయేంతలో ఓ మై గాడ్! ఆమె వక్షస్థలంలో ఒక స్తనమే కనబడింది. రెండో వైపు చదునైన భూమిలా వుంది. భయంతో, ఆశ్చర్యంతో బిగుసుకుపోయాను.

"ఆగిపోయావేం డాక్టర్! బహుశా ఇప్పుడు నీ కామ కేంద్రాల్లో ప్రకంపనలు ఆగిపోయి వుంటాయి. నీ ప్రేమపాటలకు పెరాలిసిస్ వచ్చి వుంటుంది. యునో! ఈ కారణంతోటే నా భర్త నన్ను కాదన్నాడు. ఈ కారణంతోటే నేను అతన్ని వదలి వచ్చాను. దిసీజ్ ఏ స్టోరీ ఆఫ్ ఎ ఉమెన్ విత్ బ్రెస్ట్ కాన్సర్. బ్రెస్ట్ కాన్సర్ ట్రీట్‌మెంట్ పేరుతో స్త్రీత్వపు గుర్తులైన స్తనాల్ని తీసివేసి చేతులు దులుపుకొనే డాక్టర్లందరికీ వేసే ప్రశ్న నా జీవితం.'' లలిత నేలపై కూలబడి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"రాజా! ప్రపంచంలో మరే స్త్రీ అనుభవించని విషాదం నాది. ఈ ఇగోని నీతో పంచుకోవాలనే ఇంత రాత్రివేళ వచ్చాను. నువ్వూ అందరి మగాళ్ళ లాంటి వాడివనే ఊహ భరించలేకపోతున్నాను. స్త్రీ శరీరంపై ఇంత వ్యామోహం ఎందుకు మీ మగవాళ్ళకు. ఈ శరీరాన్ని తప్ప దీని వెనుక వున్న మనసు అస్థిత్వాన్ని గుర్తించరా మగవాళ్ళు?''

"సారీ లలితా! ఆల్కహాలు మత్తులో బాలెన్స్ కోల్పోయాను. నీ హృదయాన్ని పూర్తిగా చదవకుండానే ఇద్దరి తరపున నిర్ణయాలు తీసుకొన్న దాని ఫలితమిది. స్నేహితుడిగా కాక దుండగీడులా ప్రవర్తించాను. నా ప్రవర్తనకు సిగ్గుపడుతున్నాను. జరిగిన దాన్ని మర్చిపోయి సమస్యకు పరిష్కారం వుందేమో ఆలోచిద్దాం. ముందు వివరాలన్నీ చెప్పు. ఎలా, ఎప్పుడు డయాగ్నోస్ చేశారు? ఎప్పుడు సర్జరీ చేశారు? ఈ డైవోర్సు ప్రహసనం ఎలా జరిగింది?''

"పాప పుట్టిన ఐదేళ్ళ తరువాత హఠాత్తుగా కుడి రొమ్ములో మార్పులు రావడం గమనించాను. శరీరపు

ఒక పత్రికలో ప్రకటన ఇలా వుంది:

"పిల్లలను చూచుటకు ఒక మనిషి కావలెను.

అర్హత: కుస్తీలో, ముష్టియుద్ధంలో ప్రావీణ్యత కలిగి వుండవలెను''.

— బుద్దిగం పాండురంగా రెడ్డి

ఆజ్ఞల్ని కాదని కొత్త మార్పులేవో జరుగుతున్నట్లు ఫీలయ్యాను. మెత్తగా హాయిగా ప్రవహించే భావం క్రమంగా ఘనీభవిస్తున్నట్లుగా ఫీలింగ్. ఫామిలీ డాక్టర్ని కలిసి ఈ మార్పులు చెప్పినప్పుడు ఆమె పరీక్ష చేసి 'సమ్‌థింగ్ రాంగ్ విత్ యువర్ బ్రెస్ట్ లలితా' అంటూ సర్జన్ దగ్గరకు రిఫర్ చేసింది. బయాప్సీ రిపోర్టు చూస్తున్నప్పుడు సర్జను ముఖంలో కనపడే ఎక్స్‌ప్రెషన్సులోనే నా భవిష్యత్తును, ఆయుః ప్రమాణాన్ని చదువుకోగలిగాను. ప్రమాదాన్ని సూచించే జలదరింపు, ప్రాణాన్ని పోగొట్టుకోబోయే ముందు పొందే మృత్యు భీతి కలిగింది. కాన్సర్‌గా నిర్ధారణ చేసి, రాడికల్ మాస్టక్టమీ, ఒక రొమ్మును తీసివేయడం చికిత్సగా నిర్ణయించారు.''

"కాన్సర్ అంటువ్యాధి కాదు. కానీ ఇంట్లో హఠాత్తుగా నేనో అన్ టచబుల్ అయిపోయాను. మూలనున్న గదిలోకి నా నివాసం మార్చబడింది. పాప వాళ్ళ తాతయ్య నానమ్మల దగ్గరకు పంపబడింది. నా కోసం ఒక ఆయాను, నర్సును ప్రత్యేకంగా నియమించారు. అతను మాత్రం దొంగలా నన్ను తప్పించుకు తిరుగుతున్నాడు. ఎంతో ఓదార్పు నాశించాను అతని దగ్గర నుండి. చావు బ్రతుకుల మధ్య నున్న సన్నని సరిహద్దు మీద ఎన్నో రోజులు భయభ్రాంతులతో గడిపాను. ధైర్యాన్నిచ్చే ఒక ఓదార్పు, కన్నీటిని తుడిచి గుండెలలో దాచుకునే ఒక భద్రత, ఒక లాలింపు, అనురాగం ఏదీ లేదు. అతనో గొప్ప ఇన్వెస్టర్. షేర్సు ఖరీదు చెయ్యడంలో అతని అంచనా ఎప్పుడూ తప్పుకాదు. లాభదాయకంకాని ఇన్వెస్టుమెంటు ఏదీ చెయ్యడు. కాన్సరు సోకిన పెళ్ళానికి ఆప్యాయతను, ప్రేమను ఇన్వెస్టు చెయ్యడం ఎందుకనుకున్నాడేమో?

"ఆపరేషను పూర్తయి, 100 శాతం నార్మల్ అని డాక్టరు సర్టిఫై చేసి ఇంటికి పంపారు. చావుతో పోరాడి విజయ గర్వంతో యుద్ధ సైనికురాలిలా ఇంటికి వచ్చాను. నా రాకకు ఏ ఆసక్తినీ చూపలేదు. గృహ జీవితానికి నువ్వు పనికిరావు, ఇంటికి సంబంధించినంత వరకు నువ్వు ఎక్సెస్ లగేజి అన్నట్టుగా చూడటం మొదలుపెట్టారు. పాలు, పళ్ళు మందులపై బ్రతికే వ్యర్థపదార్థంలా ఇంట్లో మిగిలిపోయాను. నాలోనూ సైకలాజికల్ మెల్ట్‌డౌన్ మొదలైంది.

నా మనో శరీరాలపై జరిగే ఈ దాడులలోకెల్లా అత్యంత ప్రమాదకరమైన దాడి, నా భర్త జరిపాడు. ఒక చీకటి రాత్రి చప్పుడు చెయ్యకుండా నా గదిలో చొరబడి దొంగలా నాపై ముట్టడిచేశాడు. కర్మాగారంలో రిపేరు కోసం ఇచ్చిన సెక్స్ పనిముట్టు బాగయి మళ్ళీ తిరిగి వచ్చింది, ఎందుకాలస్యం అనే తొందర అతనిలో. స్త్రీత్వానికి గుర్తులనబడే స్తనాన్ని కోల్పోయిన నాలో కలిగే సంఘర్షణ, వేదన అతనికి అవసరంలేదు. బ్రతిమలాడుకొన్నాను. మనోక్షేత్రం ఛిద్రమై వుందని, తేరుకోడానికి, మృదువైన శృంగార భావాలు మొలకెత్తడానికి ఇంకా వ్యవధి పడుతుందని, వదిలేయమని దీనంగా వేడుకొన్నాను. రేప్ చెయ్యడం అతనికి కొత్తకాదు. అతని నార్మల్ సెక్సువల్ ఏక్టివిటీ రేప్ అనే నిర్వచనానికి దగ్గరగా వుంటుంది. ఆ రాత్రి అదే చేశాడు. అయితే నా శరీరం సహకరించలేదు. ఇన్నాళ్ళు అతని విశృంఖలమైన దాడికి మారు మాట్లాడని, అతని సెక్స్ యంత్రం తిరుగుబాటుచేసింది. 'యూ బిచ్! డర్టీ ఫ్రిజిడ్!' అనే అమర్యాదకరమైన లేబుల్ నాకు ఇచ్చి విసవిసా వెళ్ళిపోయాడు. మరోసారి, మరోసారి వెంటవెంటనే నాపై దాడిచేసి, విసిగిపోయి, 'ఈ ఆపరేషన్ చేయించుకొన్న స్త్రీలు సంసార జీవితానికి పనికిరారా!' అని డాక్టర్లను అడగగలిగిన హృదయం లేని పశువు అతను.

నాలో కూడా అలాంటి సందేహం కలిగింది. సైకియాట్రిస్టును కలిసి నా సమస్యను చెప్పినప్పుడు ఆవిడ నిజంగా చలించిపోయింది. ఆపరేషన్ తరువాత నన్ను మృదువుగా స్పృశించి, మొదటిసారిగా నా గుండె లోతుల్ని ప్రేమతో నింపిన తొలి వ్యక్తి ఆమే. 'డోంట్ బి సిల్లీ! లలితా! అర్థంలేని సందేహం నీది. బ్రెస్ట్ పిల్లలకు పాలనిచ్చే నేచురల్ ఫీడర్. దాన్ని సెక్స్ సింబల్‌గా చేసి దానికో ముఖ్య పాత్ర నిచ్చింది మగ ప్రపంచం. శరీరంలోని చాలా ఎరోజోనస్ సెంటర్స్‌లో అది ఒకటి. మృదు స్పర్శకు స్పందించే ఎన్నో అవయవాల్లో అదొకటి. బ్రెస్ట్ సర్జరీ కారణంగా నువ్వు స్త్రీవి కాదనే వాడు వట్టి పశువు. అసలు ఆపరేషన్ అయి నెల కూడా కాకుండా ఇలాంటి ఏక్టివిటీస్ గురించి ఆలోచించే అతను జీవిత సహచరుడా? అతని కామెంట్సు పట్టించుకోకు. పెళ్ళయిన స్త్రీది చాలా విస్తృతమైన ప్రపంచం. ఇంటి పనులపై శ్రద్ధ చూపుతూ మామూలు ప్రపంచానికి రా!' సైకియాట్రిస్టుతో గడిపిన ఆ అర్థగంట తీయని అనుభూతిలా గడిచిపోయింది.

'ఆ రోజు నుండి కొత్త జీవితం ప్రారంభించాను.



ప్రాణాధారమైన జీవశక్తి లోపించి, సుఖమయమైన జీవితానికి దూరమవుతున్నారా?

నీరసం, నిసత్తువ, బలహీనతలతో బాధపడుతున్నారా?

మగవారి కోసం నూతన ప్రక్రియ ద్వారా తయారుచేయబడిన దివ్య ఔషధము.

ఫిజికెమ్ వారి

ఒజోమెన్

క్యాప్సుల్స్

అనుభవము కల్గిన ప్రఖ్యాత
ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో
తయారుచేయబడిన 'ఓజోమెన్'
క్యాప్సుల్స్ వాడి
మీ సుఖమయమైన జీవితాన్ని
పునఃప్రారంభించండి.

అన్ని ప్రముఖ మందుల షాపులలో
లభించును.

fizikem

SHAH

MANUFACTURED IN INDIA BY
fizikem.
LABORATORIES
VIJAYAWADA - 520 001 (A.P.)

పేషెంటును అనే భావం పక్కన పెట్టి మళ్ళీ యథాప్రకారం ఇంటి పనుల్లో పాల్గొన్నాను. పాపను తిరిగి ఇంటికి పిలిపించాను. ఆయాను, నర్సును పని మాన్పించాను. కొత్త ఏక్టివిటీ, కొత్త ఉత్సాహం. కానీ రాత్రిపూట మాత్రం మామూలు మనిషిని కాలేకపోతున్నాను. నాలో తీవ్రమైన ప్రతిఘటన. అవయవాలన్నీ నిశ్శబ్ద మరణాన్ని పొందినట్లుగ్గా, స్పందలనవీ గడ్డకట్టి మంచు శిఖరంలా రూపాంతరం చెందినట్లుగ్గా అయిపోతున్నాను. మంచుకొండతో అవిరామంగా పెనుగులాడి, విరక్తిచెంది వెళ్ళిపోవడం అతని దినచర్య అయింది.

'క్రమంగా అతను రాత్రులు ఇంటికి రావడం ఆపివేశాడు. ఆఫీసులో పెళ్ళికాని స్టెనోతో అను బంధం పెంచుకొన్నట్టు ఇంట్లో అందరి ముందు ఎనౌన్సు చేశాడు. 'పాప ముఖం చూసి నిన్ను తన్ని తగలేయడం లేదు. అందుకు సంతోషించు. నువ్వెటూ వేస్ట్ ప్రోడక్టువి. నా తంటాలేవో నేను పడతాను. నిజానికి నీకు డైవోర్సు ఇచ్చి ఆ పిల్లను చేసుకుందామనుకున్నాను కానీ, కోర్టుల హడావుడి ఎందుకని నిన్నిలా ఇంట్లో వుండనిస్తున్నాను. ఒక మూలన పడి వుండు. ఇంత ముద్ద వేస్తాను. ఎక్కడికి పోతావు? దేనితో పోయావు అంటూ నస గమాకు!'

'అమర్యాదకరమైన అతని మాటలకు మనస్సు భగ్గుమంది. అలాంటి ఒక భర్త. అలాంటి భార్య హోదా లేకపోతే యేం? అనిపించింది. 'డైవోర్సు తీసుకుందాం' అని ప్రపోజ్ చేశాను. ముందు ఆశ్చర్యపోయి, ఆపై కోపంతో రెచ్చిపోయి, ''బయటికి వెళ్తే నీకింత గంజినీళ్ళు పోసే దిక్కు కూడా లేదు. వేషాలు వెయ్యకుండా నా కాళ్ళ దగ్గర కుక్కలా పడి వుండు'' అంటూ రంకె వేశాడు.

'గో టు హెల్ యూ బాస్టర్డ్!' పెద్దగా గొంతు పెకిలించి అరిచాను.

'మనసులోని జుగుప్స, వేదన, కోపం ఆ మాటల్లో ధ్వనించాయి. ఆ రోజే ఇల్లు వదలి వచ్చాను కట్టు బట్టలతో.''

లలిత విషాద కథ విన్నాక మనసంతా చేదు మాత్ర తిన్నట్టుగ్గా అయిపోయింది. టంగ్, టంగ్ గడియారం మూడుసార్లు సుదీర్ఘంగా, బరువుగా ఆవులించింది. ఒక ఆటోను వెదకి లలితను ఇంటికి సాగనంపి ఎదలో లలిత చెప్పిన విషాదాల వీణ భోరుమని పాడుతుండగా నిద్ర బొరియలోకి నిష్క్రమించాను.

***

క్లినిక్‌లో పేషెంట్లను చూస్తూ వుండగా, టేబుల్‌పై వున్న డైలీ పేపరుపై అనాలోచితంగా నా దృష్టిపడి, అక్కడ లలిత ఫోటో చిన్న ప్రకటన కనపడి ఉలిక్కిపడ్డాను.

మమ్మీ!

ఐ నీడ్ యూ! నాకు నువ్వు కావాలి. ప్రతిరోజూ నీ కోసం ఏడుస్తూనే వున్నాను. ప్లీజ్ మమ్మీ కమ్ బాక్! డాడీతో సహా అందరూ నీ రాక కోసం ఎదురు చూస్తున్నారు. వెంటనే ఇంటికిరా!

పద్మిని

ప్రకటన చదివి తృప్తిగా నిట్టూర్చాను. లలిత సమస్యకు ఒక సినిమా టిక్ పరిష్కారం దొరికింది కదా అని. లలితకు కావాల్సింది మరో కొత్త వైవాహిక జీవితం కాదేమో అనిపించింది. ఇల్లు, ప్రేమించే పిల్లలు, వాళ్ళ అనురాగం, ఆప్యాయత లలితకు కావాల్సినవి ఇవే అన్పించింది.

మధ్యాహ్నం లలిత ఇంటికి వెళ్ళేసరికి, అక్కడో పెద్ద మహిళా మేళా జరుగుతుంది. 'మానుషి మహిళా వేదిక' అంటూ బయట ఒక బేనర్ వేళ్ళాడుతుంది.

''రా రాజూ! మంచి టైముకు వచ్చావు. ఊళ్ళో వున్న ఉమెన్ ఏక్టివిస్టులందరితో కలిసి ఒక ఫోరమ్ ఏర్పాటుచేస్తున్నాము. ఇదో రీ హేబిలిటేషన్ సెంటరు. డాక్టర్లు, లాయర్లు, సివిల్ సర్వెంట్లు, వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు, లెఫ్టిస్టులు ఎందరో ఈ ఫోరమ్‌లో సభ్యులుగా వున్నారు. సెమినార్లు, సింపోజియమ్‌లు మీడియా ద్వారా ప్రచారం, కుటీర పరిశ్రమలు, అవసరమైన న్యాయ సహాయం ఇలా ఎన్నో ప్రణాళికలతో ఈ ఫోరమ్ మొదలుపెడుతున్నాము. నీలాంటి మిత్రుల ఆశీస్సులు, తోడ్పాటు కూడా కావాలి'' అంటూ వేదిక వైపు దారితీసింది. చిన్నమాట అంటూ ఆమె చేతిలో పేపరు పెట్టి ప్రకటనను చదవమని ఇచ్చాను. ఆశ్చర్యంతో ప్రకటన వైపు చూసింది.

లలిత కళ్ళలో నీటి చెమ్మ. పొంగి వచ్చే దుఃఖంతో కాసేపు వివశురాలైంది. అయితే ఆ ఉద్వేగం కొద్ది క్షణాల పాటే. అంతలోనే తేరుకొంది.

''ఉద్యమాల బాటలోని వాళ్ళకు అనుబంధాలుండకూడదు. నా పోరాట బాటలో నన్ను సాగిపోనీ. కొన్నేళ్ళు పోయినాక, ఊహ తెలిశాక, విషయాలు అర్థమయితే, పద్మినే నా దగ్గరకు వస్తుంది, నా ఆశయ సాధనలో భాగం కావడానికి. అందాక సారీ, అండ్ గుడ్ బై టు పద్మిని.''

పేపర్ పక్కకు విసిరి జనం మధ్యలోకి అడుగులు వేసింది లలిత. ●